సాక్షి శ్రీకాకుళం

శనివారం । 11 । నవంబర్ । 2023



న్యూస్‌రీల్

కిడ్నీ ఆస్పత్రి ప్రారంభ తేదీలో మార్పు

కాశీబుగ్గ: పలాసలో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభ తేదీ మార్పు చేస్తున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సమాచారం వెలువడింది. ఈ నెల 23వ తేదీ గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాస రావాల్సి ఉండగా అదే రోజు ఏకాదశి సందర్భంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందని భావించి 25, లేదా 29 తేదీలను ప్రారంభానికి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

శ్రీకూర్మనాథాలయ హుండీల ఆదాయం రూ. 12,26,382


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలోని హుండీలను శుక్రవారం తెరచి లెక్కించగా రూ. 12,26,382 లు వచ్చిందని ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు. శ్రీకూర్మనాథాలయంతో పాటు ఉపాలయమైన పాతాళ సిద్ధేశ్వరస్వామి ఆలయ హుండీలను తెరిచి లెక్కించారు. నగదుతో పాటు కిలో 224 గ్రాముల వెండి కూడా లభ్యమైంది. కార్యక్రమంలో జీవీబీ రవికుమార్, పాలకమండలి సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, అనుపోజు నాగరాజు, జి.లక్ష్మణాచార్యులు, ఎస్.పద్మనాభాచార్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం ఈఓ టి.వాసుదేవరావు, మల్లన్న ఆలయం ఇన్‌చార్జి ఈఓ జి.ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.1,35,103 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించే తల నీలాల హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఏలూరుకు చెందిన తమ్మన శివప్రవీణ్ ఏడాది కాల పరిమితికి రూ.2,15,000కు వేలం పాటతో తల నీలాల హక్కును సొంత చేసుకున్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయండి


మంత్రి ధర్మాన సమక్షంలో పార్టీలోకి చేరిన పాత్రునివలస గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి పలువురు యువకులు మంత్రిని కలిసి పార్టీలోకి చేరారు. ప్రతి ఒక్కరికీ పార్టీ కండువా వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాకుళంలో మంత్రి ధర్మాన గెలుపునకు అంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాణాల దాలినాయుడు, బాణాల రామినాయుడు, తదితరులు ఉన్నారు.



● ఆ జెండా..

సంక్షేమానికి అజెండా


● ఎచ్చెర్ల

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

నాలుగున్నరేళ్ల కిందట జనం పెట్టుకున్న నమ్మకాన్ని వైఎస్సార్ సీపీ ఎలా నిలబెట్టుకుందో నాయకులు వారికి మళ్లీ వివరించారు. వేసిన ఓటుకు, చేసిన ప్రమాణానికి ఎలా సార్థకత చేకూర్చారో విశదీకరించారు. ఇన్ని రోజుల పాలన తర్వాత నడివీధికి సగర్వంగా వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును గుర్తు చేశారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ మళ్లీ రావాలంటూ పార్టీ జెండాను ఎగరేసి మరీ చెప్పారు.

వై ఏపీ నీడ్స్ జగన్

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

చిలకపాలెం, అల్లినగరం గ్రామాల్లో జరిగిన వై ఏపీ నీడ్స్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. మేనిఫెస్టోలో 98 శాతం హామీలు అమలు చేశామని వివరించారు. పార్టీ జెండాలు, మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీలు ఆవిష్కరించారు.

● పాతపట్నం

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. పాతపట్నం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి మండలాల్లోని గ్రామాల్లో ప్రజలకు వైఎస్ జగన్ పాలనను విశదీకరించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ పాలన ఎందుకు అవసరమో వివరించారు.


ఎల్.ఎన్.పేట: పథకాలపై అవగాహన కలిగిస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


● నరసన్నపేట

అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అవలింగిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి స్థానికుల్లో చైతన్యం నింపారు. వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు.

సారవకోట: అవలింగి సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

● పలాస

గ్రామీణుల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్తేజం నింపుతున్నాయి. మందస మండలం జిల్లుండలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ సమాచారాన్ని అందజేశారు.


మందస: జిల్లుండలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు


● ఇచ్ఛాపురం

జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఇంటింటికీ తిరిగారు. కవిటి, బెజ్జిపుట్టుగ వాసులకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. చేసిన సంక్షేమాన్ని చెప్పారు.

కవిటి: కవిటిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రచారంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్, కార్పొరేషన్ చైర్మన్లు

టెక్కలి వాసులకు వైఎస్ జగన్ సుపరిపాలనను వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి వివరించారు. సచివాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. నందిగాం మండలం కాపు తెంబూరులో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు.

టెక్కలి సచివాలయం -4 లో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాత తదితరులు


● టెక్కలి


● శ్రీకాకుళం

వైఎస్సార్‌సీపీది అవినీతి రహిత పాలన అని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శాలిహుండం సచివాలయ పరిధిలో ఇంటింటికీ తిరిగారు. పథకాలు ఎలా అర్హులకు అందజేశారో వివరించారు.

గార: సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్

24న ఆదిత్యుని తెప్పోత్సవం


సమావేశానికి హాజరైన పాలక మండలి సభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హంస నావికోత్సవం ఈ నెల 24న ఘనంగా నిర్వహించాలని ఆలయ పాలకమండలి తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం స్థానిక ఆలయంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పాలకమండలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఉత్సవ ఏర్పాట్లపై తమ నిర్ణయాలను తెలియజేశారు. సమావేశంలో పాలకమండలి ఎక్స్‌అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, డాక్టర్ సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, జె.శ్రీనివాస్, దుక్క గనిరాజు, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి తదితరులు, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

సమావేశంలో తీర్మానించిన అంశాలివే..

- ఈ నెల 24న సాయంత్రం అరసవల్లి ఇంద్రపుష్కరిణిలో క్షీరాబ్ధి ద్వాదశి (హంసనావికా ఉత్సవం) నాడు గత లోపాలను సరిదిద్దుకుని పక్కాగా ఏర్పాట్లు చేయాలి.
- పుష్కరిణిలో శ్రీవారి ఉత్సవమూర్తులతో ఉన్న హంసవాహనంలోకి ధార్మిక (అర్చకులు) సిబ్బంది మినహాయించి మరెవ్వరికీ అనుమతి ఇవ్వకూడదు.
- పుష్కరిణి చుట్టూ అందమైన విద్యుత్ అలంకరణ, భక్తులకు అన్ని విషయాలు, ఏర్పాట్లు, సౌకర్యాల వివరాలు తెలిసేలా ఫ్లెక్సీలు, సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలి.
- హంసనావికోత్సవం (తెప్పోత్సవం) నాడు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు గర్భాలయంలో ఆదిత్యుని మూలవిరాట్టుకు పూర్తిగా స్వర్ణాలంకరణతోనే భక్తులకు దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాలి.
- స్థానిక ఆలయం ఎదురుగా ఉన్న 12 సెంట్ల నివాస స్థలాన్ని దేవస్థానం నిధులతో కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని కూడా ట్రస్ట్ బోర్డు సభ్యులు నిర్ణయించారు.

రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్


శ్రీకాకుళం పాతబస్టాండ్: భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఇదే గొప్ప అవకాశమని ఆయన అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ కార్యాలయంలో 132 చోట్ల జరుగుతున్న రీ సర్వే మూడో దశ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులకు సిబ్బంది కొరత లేదని, ప్రతి రోజూ ఒక్కో గ్రామంలో కనీసం 20 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్ర స్థాయిలో సర్వే పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. మొబైల్ మెజిస్ట్రేట్ బృందం సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపాలని, లేదంటే అప్పీల్స్ పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, పద్మావతి, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.విజయ్ కుమార్, అన్ని మండలాల తహసీల్దార్‌లు, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్లు సిబ్బంది హాజరయ్యారు.

'అర్హులను ఓటర్లుగా చేర్పించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పద్దెనిమిదేళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం చురుగ్గా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన శుక్రవారం సమీక్షించారు. తుది ఓటర్ల జాబితా వచ్చే ఏడాది జనవరి 5న ప్రచురిస్తామని అప్పటికి ఓటర్ల జాబితా పూర్తి స్థాయిలో మదింపు జరగాలని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులతో తహసీల్దార్లు ఎప్పటికప్పుడు ముఖాముఖి సమావేశాలు నిర్వహించడం ద్వారానే అది సాధ్యమవుతుందని తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోసారి బూత్ లెవెల్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నాయి గనుక ఇప్పటినుంచే అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించుకోవాలని వివరించారు. 2024 ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 288 సెక్టోరియల్ అధికారుల నియామకాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అదే స్థాయిలో పోలీసు అధికారుల నియామకం త్వరలో పూర్తవుతుందన్నారు. ఓట్ల తొలగింపు సమయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సంతకాలు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమదాలవలస పట్టణంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని ఐజే నాయుడు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే లక్ష్మీ టాకీస్, ఐజేనాయుడు కాలనీలో ఉన్న చౌక ధరల దుకాణాలను పరిశీలించారు. లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. ఈ రకం బియ్యం తింటే శరీరానికి పోషకాలు అందుతాయన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అమ్మడం, కొనడం చెయ్యకూడదని ఆయన అన్నారు.



క్లుప్తంగా

'పింఛన్లలో జాప్యం వద్దు'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ విరమణ చేసిన పింఛన్‌దారుల నెలవారీ పింఛన్లు, ఇతర అలవెన్సుల పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని పింఛనర్లు ఖజానా శాఖ డీడీ రవికుమార్‌ను శుక్రవారం కోరారు. ఈ మేరకు వారితో డీడీ సమావేశం నిర్వహించారు. పెన్షన్ ఒకటి లేదా రెండో తేదీన చెల్లింపు చేయాలని కోరారు. సీఎఫ్ఎంఎస్ సమస్యలను పరిష్కరించి ఆగిపోయిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. డేటాలో తప్పులను సవరించాలన్నారు.

'నాణ్యత లోపించకూడదు'

జలుమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దలో నాణ్యత లోపించకూడదని డీఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం మాకివలసలో ఎయిడెడ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆయా పాఠ్యాంశాలలో నేర్చుకున్న అంశాలు, ఉపాధ్యాయుల బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్య బోధించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం వండాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఎంఈఓలు బి.మాధవరావు, ప్రసాదరావు, సీఆర్పీ శంకరరావు సిబ్బంది ఉన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం క్రైమ్ : మందుగుండు సామగ్రి విక్రయాలకు అనుమతులు పొందిన దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వద్ద బాణసంచా విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాలను శుక్రవారం సాయంత్రం ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి బాణసంచా సామగ్రి విక్రయించాలని సూచించారు. షాపుల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు.





నవ్వులే దివ్వెలై



కవిటి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తుగా దీపావళి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు దీపాలు వెలిగించి నరకాసుర వధ ఘట్టాలను ప్రదర్శించారు. బాణసంచా పేల్చి సందడి చేశారు. – కవిటి



మతాబులు,కాకరొత్తులు కాల్చుతున్న చిన్నారులు



సత్యభామ,శ్రీకృష్ణుల వేషధారణలో కల్యాణిస్కూల్ బాలికల ప్రదర్శన

అత్తమామలే హతమార్చారు

- కోడలిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ
- నెల తర్వాత భయంతో పోలీసులకు లొంగుబాటు

ఇచ్ఛాపురం రూరల్: ఇల్లాలిని కూతురిలా చూసుకోవాల్సిన అత్తమామలు ఆమె పాలిట కాలయములయ్యారు. కోడలిని కర్కశంగా హత్య చేసి ఆత్మహత్య చేసుకుందని అందరినీ నమ్మించారు. నెల రోజులుగా ఎవరికి దొరికిపోతామో అని భయపడుతూ చివరకు పోలీసులకు లొంగిపోయారు. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం నీలాపపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు మీనాకుమారి(22) ఈ ఏడాది అక్టోబర్ 7న ఇంటిలోనే ఉరి వేసుకొని మృతి చెందినట్లు అత్తమామలు నీలాపు అన్నపూర్ణ, జగ్గారావులు పోలీసులకు తెలిపారు. అయితే అప్పట్లో మీనాకుమారి తల్లి మోహిని తన కూతురు మృతి అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తు జరుగుతుండగానే అత్తమామలు గురువారం పోలీసులఎదుట లొంగిపోయారు. తామే చంపేశామని ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఐ ఆర్.ఈశ్వర చంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మృతురాలు మీనాకుమారి భర్త మోహన బాబు ఏడు నెలల కిందట పోలెండ్ దేశానికి ఉపాధి కోసం వెళ్లిపోయాడని, అప్పటి నుంచి మీనాకుమారితో అత్తమామలకు గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. అక్టోబర్ 8న సాయంత్రం మరోమారు గొడవ జరగడంతో మామ జగ్గారావు కర్రతో మీనాకుమారి తలపై బలంగా కొట్టడంతో ఆమె పడిపోయిందని, మళ్లీ లేచాక మరోసారి గొడవ పడడంతో అత్తమామలు కలిపి పీక నులిమి చంపేశారని వివరించారు. ఈ విషయాన్ని పక్కింటికి చెందిన నీలాపు హేమారావుకు చెప్పడంతో ఆయన సాక్ష్యాలను తారుమారు చేశాడని, రక్తపు మరకల్ని తుడిచేసి, మృతురాలి ఒంటిపై ఉన్న పంజాబీ డ్రస్సును తొలగించి నైటీలోకి మార్చి మంచంపై పడుకోబెట్టి ఉరిపోసుకొని మృతి చెందినట్లు గ్రామస్తులు, మృతురాలి తల్లిదండ్రులు, పోలీసులను నమ్మించడానికి ప్రయత్నించారని తెలిపారు. అయితే పోస్టుమార్టం రిపోర్టులో ఇది హత్యగా తేలిపోతుందని, తాము దొరికిపోతామని భయపడిన అత్తమామలు గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. వారిని సోంపేట కోర్టుకు తీసుకువెళ్లి అక్కడ నుంచి శ్రీకాకుళం తరలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ కె.గోవిందరావు, హెచ్‌సీ వై.రమణ, కానిస్టేబుల్ కిరణ్, అనూష, కనకమ్మ, రామరావులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈశ్వర చంద్ర ప్రసాద్, ఎస్ఐ గోవిందరావులు

గురుకుల పాఠశాల పరిశీలన

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే కృషి చే యాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తని ఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు రావాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లంపై పలు ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, కేవీ రామూర్తి, త్రినాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందసలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

మందస: మందస పట్టణంలోని కొండివీధిలో అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నారు. బత్తుల మోహనరావుకు చెందిన గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం(పీడీఎస్) 27 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసినట్టు జిల్లా సప్లయి అధికారి రమణ చెప్పారు. సీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీలు శానాపతి రవికుమార్, గోపాలరావు, వీఆర్వో యు.భైరాగిలు గోదాములో తనిఖీ చేయగా, 50 కిలోల మూటలు 27 ఉన్నట్లు గుర్తించామన్నారు. 1380 కిలోల బియ్యం మార్కెట్‌లో రూ.54.44వేలు ఉంటుందన్నారు. ఉచిత బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ పేదలకు అందజేస్తుండగా, వారి వద్ద మోహనరావు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నాడన్నారు. నిందితునిపై 6ఎ కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పలాస ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్టు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్స్, అంగన్‌వాడీ హెల్పర్స్, మినీ అంగన్‌వాడీల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. సాధారణ నోటిఫికేషన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ 11 పోస్టులు, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు 26 కలిపి మొత్తం 37 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శాంతిశ్రీ తెలిపారు. అర్హత కలిగిన, అర్హులైన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి అందజేయాలని ఆమె కోరారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5గంటలలోగా అందజేయాలని పేర్కొన్నారు.

టెక్కలి సబ్ డీఎఫ్ఓగా నాగేంద్రరావు

అరసవల్లి: టెక్కలి సబ్ డీఎఫ్ఓగా ఏవీ నాగేంద్రరావును నియమిస్తూ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ వై.మధుసూదనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా అటవీశాఖలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లను అసిస్టెంట్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ (సబ్ డీఎఫ్ఓ)గా పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలోనే ఒంగోలులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాగేంద్రరావుకు ఏసీఎఫ్‌గా పదోన్నతి కల్పించి క్లియర్ వేకెన్సీగా ఉన్న టెక్కలిలో నియమించారు. అలాగే ఇంతవరకు కాశీబుగ్గ రేంజ్ సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న యాళ్ల సంజయ్‌కు ఏసీఎఫ్‌గా పదోన్నతి కల్పిస్తూ పాలకొండ సబ్ డీఎఫ్ఓగా నియమించారు.

'పోలీసుల్లో వృత్తి నైపుణ్యాలు తప్పనిసరి'

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసుల్లో వృత్తి నైపుణ్యాలు తప్పనిసరని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం ప్రత్యేక పోలీస్ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసులు వృత్తి పరమైన ఒత్తిడికి దూరంగా ఉండాలంటే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని అన్నారు. వృత్తి పరమైన, వ్యక్తి గత సమస్యలు తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపు

నరసన్నపేట: నరసన్నపేటలో ఈ నెల 15న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో యాత్ర సన్నాహక సమావేశాన్ని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ రెండో విడత యాత్రలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. రెండో విడతలో ఉత్తరాంధ్రలో మొదటగా నరసన్నపేట నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దీనికి అన్ని గ్రామాల్లో సన్నాహకాలు చేయాలని కోరారు. పోలాకి జెడ్పీటీసీ, పార్టీ బీసీ సెల్ జోనల్ కమిటీ కన్వీనర్ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ యాత్ర సభ మనకు ఎంతో ప్రతిష్టాత్మకమని అన్నారు. మబగాం నుంచి బస్ యాత్ర ప్రారంభం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జలుమూరు ఎంపీపీ వాన గోపి, పార్టీ నాయకులు చింతు రామారావు, ధర్మాన జగన్, వరుదు వంశీ కృష్ణ, నక్కు తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

కరువు ప్రాంతాలపై నివేదికలివ్వండి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నీటిపారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాలతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 4 మండలాల్లో వర్షపాతం లోటు ఎక్కువగా ఉందని తెలిపారు. ఖరీఫ్ సాగు కూడా తక్కువగానే జరిగిందని అన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలిపారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతులందరికీ ఉచిత పంటల బీమా వర్తింపజేయాలని సూచించారు.

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో రబీ పంటలకు సాగునీరు ఇవ్వలేమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. రబీకి ఈ సీజన్‌లో 90 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడమే దీనికి కారణమని ఆయన అన్నారు. వంశధార, నాగావళి నదులపై ఉన్న ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్‌కి చేరుకున్నాయని, రైతులు రబీకి వరి కాకుండా వేరుశనగ, నువ్వులు, పెసలు, మినుములు, రాగి, కట్టే జనుము లాంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. జనవరికి 4,263 టన్నుల విత్తనాలు కూడా సిద్ధం చేసినట్టు చెప్పారు. రైతులకు ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు ముద్రించాలని, ప్రసార మాధ్యమాల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ నెల 30 నాటికి జిల్లాలో కొన్ని మండలాల కరువు పరిస్థితులు గురించి ఆ శాఖ కమిషనర్‌కి పూర్తి నివేదికలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. గుర్రపు డెక్కల తొలగింపు కోసం ఆయాచోట్ల రసాయనాలు జల్లే పద్ధతిని పరిశీలించాలన్నారు. ప్రధాన నదులలో నీటి ప్రవాహం, రిజర్వాయర్‌లలో నీటి నిల్వలపై కలెక్టర్ చర్చించారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఈ సారి ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు వెంటనే నగదు వారి ఖాతాల్లో జమ అయ్యేలా ఉంటుందని స్పష్టం చేశారు. సిబ్బందికి శిక్షణలు పూర్తి చేశామని, ఈ సారి జీపీఎస్, బయో మెట్రిక్ పరికరాలు తప్పనిసరి చేశామని, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ఇప్పటి నుంచే పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. రైతులకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకించి రూపొందించిన వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా చెరవేయాలన్నారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, వ్యసాయ మండలి సభ్యులు పీసా శ్రీహరి, అగ్రిమిషన్ సభ్యులు గుండ రఘురాం, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర రావు, నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గల శాఖా గ్రంథాలయాధికారులు, గ్రామీణ గ్రంథాలయాధికారులతో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కుమార్‌రాజు మాట్లాడుతూ జిల్లాలోగల శాఖా గ్రంథాలయాధికారులు వారోత్సవాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా శాఖా గ్రంథాలయాధికారులు, గ్రామీణ గ్రంథాలయ పాలకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్‌రాజు

14న డిగ్రీ బీఓఎస్, ఐటీఈపీ డిగ్రీ కరిక్యులమ్ డిజైన్‌పై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14వ తేదీన డిగ్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్, కొత్తగా వర్సిటీలో ప్రవేశ పెడుతున్న నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం కరిక్యులమ్ డిజైన్‌పై సమీక్ష నిర్వహించనున్నట్లు అకడమిక్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. వర్సిటీలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ డిగ్రీ కోర్సుల సిలబస్ కూర్పు, పరీక్షల నిర్వహణ, అకడమిక్ ఏడాది నిర్వహణపై చర్చించనున్నట్లు చెప్పారు. వర్సిటీలో ప్రవేశ పెడుతున్న నాలుగేళ్ల డిగ్రీ+బీఎడ్ కోర్సు సిలబస్, అకడమిక్ క్లాస్‌వర్క్ డిజైన్‌పై సమీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఈ కోర్సు డిజైన్ ఉంటుందని అన్నారు.

ఇళ్ల స్థలాల నిర్ణయంపై జర్నలిస్టుల హర్షం



శ్రీకాకుళంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో నిర్ణయించడం హర్షణీయమని జర్నలిస్ట్ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి శుక్రవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే-ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్,ఏపీజేఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శాసపు జోగినాయుడు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు తెలిసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులతో పాటు అందరినీ గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి డోల అప్పన్న, తిత్తి ప్రవీణ్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంజి ఆర్.ఎజ్రా, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి కందుల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పాతపట్నం నియోజకవర్గంలోని పాత్రికేయులు, టీవీ జర్నలిస్టులు హర్షం ప్రకటించారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలసి పాత్రికేయులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జర్నలిస్టులు సీపాన నాగభూషణరావు, అల్లు నర్సింహారావు, కంచరాన రవికుమార్, వైశ్యరాజు శ్రీనివాసరావు, చింతాడ అర్జునుడు, కర్నం సింహాచలం, గోవిందరావు, చాణక్య శ్రీరాం, భాస్కరరావు, రామిరెడ్డి, క్రాంతి, సింహాచలం, విలోచనబాబు, రామారావు, మోహన్, శ్రీనివాసరావు, దాసు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి జర్నలిస్టులతో కలసి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అర్హులందరికీ సంక్షేమం చేరువ

కొత్తూరు: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అందజేశారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మాతల గ్రామ పంచాయతీ పరిధి మాతల, పెనుగోటివాడ, కుద్దిగాం, మాతల కాలనీల్లో ఆమె శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే తప్ప పనులు జరిగేవి కావని, ఇప్పుడు పార్టీలకు అతీతంగా సంక్షేమం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాతల సర్పంచ్ కలమట సుప్రియ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు చింతాడ సూర్యనారాయణ, ఏవీ సురేష్ కె.కృష్ణారావు, బాలరాజు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, విష్ణు, కలమట రమేష్, పంకజదాస్, వనము లక్ష్మీ నారాయణ, వైకుంఠరావు, పాతపట్నం వైస్ ఎంపీపీ ప్రతీప్, గార రాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాతల గ్రామంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ONE SITTING : 10th, 12th, B.A., B.Com, B.Sc., PG, B.Ed., Engineering, Pharmacy, Nursing, Agri, VET. From Recog. Universities (For Discont. /Drop out) Exam in Nov/Dec. WES / IQAS / EMBASSY Attestation will be done Cont: ✆ : 73383 76874 [R-142]

FLAT FOR LEASE

■ EAST FACING HOUSE for sale. GF 2BHK, and 1 BHK 1st FLR DUPLEX Collectors bungalow Rd. Srikakulam. For details contact 9160481237 [S-1184568]

■ Yendada 3BHK East, West Facing 1350 sft 5th Floor. 503 & 597. 100% Vasthu Flats Ready for Sale East (72Lakhs), West (70Lakhs) No Brokers, Cont: 90106 95599, 94400 68080. [P-193052]

PLOT FOR SALE

■ శ్రీకాకుళంలో రాగోలు మరియు కింగపట్నం సమీపంలో SUDA/RERA ప్రాజెక్టులో 40" ROADS తో VILLAS /HOUSE SITES, బ్యాంక్‌లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్‌తో కూడిన వెంచర్లో ప్లాట్స్‌కై సంప్రదించండి. 8897711559, 8985174489 [S-1192176]

■ 20 లక్షలకే ఇళ్ళు 5 లక్షలకే 100 గజాలు ఇళ్ళ స్థలాలు విశాఖపట్నం సిటీలో ఆరిలోవ, పెందుర్తి, VZM సిటీ సమీపంలో రెడ్డిపల్లి, గుజ్జుపురుపేట, శ్రీకాకుళం సిటీ సమీపంలో రణస్థలం. ఫోన్: 78619 73283, 83744 82518 [V- 797003]

GODOWNS FOR LEASE

■ Lease, Godowns-PEB Structure Suitable for MSME, Stock points Hospitals, Logistics, Abutting to Highway, Etcherla, Srikakulam. Ph: 94414 40553 [S-771140]

HOUSE FOR SALE

■ ఇండిపెండెంట్ హౌసెస్ విశాఖ - శ్రీకాకుళం హైవే ప్రక్కన రణస్థలం టౌన్‌లో 100 గ॥ 900 Sft S&N/F @ 30L మరియు 124 గ॥ 1100 Sft S&N/F @ 36L. 90% బ్యాంక్ లోన్. కంపౌండ్ వాలు. 100% వాస్తుతో ఫర్ సేల్. ఫోన్ : 93919 50505 [V- 2892]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-1220945]

WANTED

■ శ్రీకాకుళంలో ప్రముఖ దంత వైద్యశాల నందు పనిచేయుటకు హెల్పర్స్ (Chair Asst.) & టెలికాలర్స్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. Qly: ఇంటర్/ 10th/ డిగ్రీ. సెల్: 6300417378, 8106665516 [S-771142]

■ పర్మినెంట్ ఉద్యోగ అవకాశం. విజయవాడలో 18-50 సం॥ మధ్య వయస్సు గల యువతీ యువకులకు ఆకర్షణీయమైన జీతము ఉచిత వసతి, భోజన సదుపాయము. పెట్రోలు బంక్‌లో పనిచేయుటకు కన్సల్టింగ్ ఏజెన్సీ వారికి కమీషన్ ఇవ్వబడును. సెల్: 73960 06322 [G-8420]

■ వైజాగ్ దగ్గర కొత్తవలసలో మా తోటలో ఉండి ఆవుపాలు తీయుటకు భార్యాభర్తలు కావలెను. ఉచిత గృహము, పాలు ఇచ్చి నెలకు 18,000/- ఇవ్వబడును. ఫోన్ : 93471 33239 [V-797052]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయు వారు RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd.7993583999 [HA-831]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.